క్లుప్తంగా

చికెన్ ధర పైపైకి..

తిరుమలగిరి : చికెన్ ధరలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మార్కెట్‌లో డ్రెస్డ్ స్కిన్‌తో కేజీ రూ.249, స్కిన్ లెస్ కేజీ రూ.284 ధర పలుకుతోంది. వేసవి అధిక ఉష్ణోగ్రతల కారణంగా కోళ్ల పెంపకం గతంలో కంటే తగ్గింది. కోళ్లను ఇతర జిల్లాల నుంచి తీసుకొని రావడంతో ధరలు పెరుగుతున్నాయి. దీనికి తోడు కోళ్ల దిగుమతి కూడా తక్కువగా ఉండి ధరల పెరుగుదలకు కారణమైందని వ్యాపారులు తెలుపుతున్నారు. ఈ వారం కోడి హోల్ సేల్ ధర కేజీ రూ.150 ఉంది. దీని వల్ల ధర పెంచి విక్రయించాల్సి వస్తోందని, తరుగు కారణంగా కొంత నష్టం కూడా వాటిల్లుతోందని వ్యాపారులు చెబుతున్నారు. వాతావరణం పూర్తి స్థాయిలో చల్లబడితే కోళ్ల పెంపకం అనుకూలంగా ఉంటుంది. ప్రస్తుతం దుకాణాల్లో అమ్మకాలు సైతం తగ్గాయి. మరో నెల రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటుందని భావిస్తున్నారు. చికెన్ ధర బాగా పెరగడంతో వినియోగదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేరాలని ప్రచారం



అర్వపల్లిలో కరపత్రాలు పంచుతూ ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

అర్వపల్లి : పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని ఆ కళాశాల ప్రధానాచార్యుడు పెరుమాళ్ల యాదయ్య కోరారు. సోమవారం కళాశాల ఆధ్వర్యంలో అర్వపల్లిలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. కళాశాలలో ఉన్న కోర్సుల ప్రత్యేకత, కళాశాలలో సౌకర్యాలు వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు జి. శ్రీనివాస్, జి.వెంకట్‌రెడ్డి, బోయిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

సూర్యాపేట : మండల పరిధిలోని పిన్నాయిపాలెంలో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన వీరబోయిన సైదులు తన గేదెను రోజు మాదిరిగానే సోమవారం మేతకు వదిలాడు. ఆ గేదె మేత మేస్తూ వెళ్లి గ్రామంలోని పాఠశాల సమీపంలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ ఎర్త్ వైర్‌కు తగిలింది. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి గేదె అక్కడికక్కడే మృతి చెందింది. గేదె విలువ రూ.50 వేలకు పైగా ఉంటుందని, ప్రభుత్వం నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.

పెద్ద సీతారాంతండాలో రెండు..

పెన్‌పహాడ్: మండల పరిధిలోని పెద్ద సీతారాం తండాలో సోమవారం విద్యుదాఘాతంతో రెండు గేదెలు మృతి చెందాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన బాణోతు సక్రు, బాణోతు నాగులుకు చెందిన గేదెలు మేతకోసం గ్రామ శివారులోని వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లాయి. అయితే ఇటీవల ఈదురుగాలులకు తెగిపడిన విద్యుత్‌లైన్ వైర్లు గేదెలకు తగిలాయి. దీంతో విద్యుదాఘాతం ఏర్పడి రెండు గేదెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని బాధితులు కోరుతున్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలో మదర్ థెరిస్సా కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. గ్రామంలోని కంటి సమస్యలున్న వారిని గుర్తించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కంటి వైద్య నిపుణుడు డాక్టర్ సత్య, ఆశ్రమాలజిస్టు మంజుల, నాగరాజు, గ్రామస్తులు బింగి కృష్ణమూర్తి, కుంభం నరేందర్, సురేష్, గోపాల్ పాల్గొన్నారు.

అస్తవ్యస్త డ్రెయినేజీతో అవస్థ

తుంగతుర్తి : మండల పరిధిలోని కొత్తగూడెం గ్రామంలోని ఎస్సీ కాలనీలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మురుగునీరు, వర్షపు నీరు వీధిల్లోకి చేరి దుర్వాసన వస్తోంది. గత సంవత్సరం నుంచి డ్రెయినేజీలో మట్టిని తీయకుండా వదిలి వేయడంతో కాలువ పూర్తిగా నిండిపోయింది. ఈ కాలువను చివరి వరకు ఏర్పాటు చేయకుండా మధ్యలోనే ఆపివేయడంతో మురుగు నీరు, వర్షపు నీరు వీధుల్లోకి చేరుతోంది. దీంతో ప్రజలు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి డ్రెయినేజీ కాలువను చివరి వరకు పొడిగించి, నెలకోసారి శుభ్రం చేయించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



చెత్తాచెదారంతో నిండిన డ్రెయినేజీ

నేలకు సారం.. పంటకు ప్రాణం

- పూడిక మట్టితో బహుళ ప్రయోజనం
- ఉపాధి కూలీలతో వ్యవసాయ భూములకు చెరువు మట్టి తరలింపు



లింగాలలో ట్రాక్టర్‌లోకి చెరువు మట్టి నింపుతున్న కూలీలు

పెన్‌పహాడ్ : చెరువు మట్టిలో సాగు భూములకు కావాల్సిన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. పూడిక మట్టిని పొలాలకు తరలించడంతో నేల సారవంతమవుతోంది. అయితే ప్రస్తుతం ఉపాధి హామీ పనుల్లో భాగంగా పెన్‌పహాడ్ మండలంలోని చెరువులు, కుంటల్లో పూడిక తీత పనులు నడుస్తున్నాయి. మండల కేంద్రంతో పాటు అనంతారం, లింగాల, చెట్లముకుందాపురం, భక్తాళాపురం, మహ్మదాపురం, అనాజిపురం, ధర్మాపురం తదితర గ్రామాల్లోని చెరువుల నుంచి పూడిక మట్టి తవ్వకం పనులు జోరుగా సాగుతున్నాయి. ఉపాధి హామీ పథకంలో పూడిక మట్టి కోసం దరఖాస్తు చేసుకున్న రైతులకు ఉచితంగా సరఫరా చేస్తున్నారు. ఉపాధి కూలీలతో చెరువుల నుంచి మట్టిని తవ్వించి ట్రాక్టర్‌లో పొలాలకు తరలిస్తున్నారు. ఆయా గ్రామాల్లో ఇప్పటి వరకు 781 ట్రిప్పుల మట్టిని రైతుల పొలాలకు సరఫరా చేశారు.

పుష్కలంగా నత్రజని, పొటాష్..

చెరువు మట్టిని రైతులు పొలాల్లో వేసుకోవడంతో అనేక లాభాలున్నాయి. పూడిక మట్టిలో వివిధ పంటల మొక్కలకు అవసరమైన నత్రజని, పొటాష్, జింక్, మెగ్నీషియం పుష్కలంగా ఉంటాయి. నత్రజని మొక్క పెరుగుదలకు ఉపయోగపడుతుండగా, పొటాష్ తెగుళ్లను తట్టుకునే శక్తిని ఇస్తుంది. చెలక భూములకు చెరువు మట్టి సేంద్రియ ఎరువుగా పనిచేస్తోంది. పూడిక మట్టితో రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుండటంతో రైతులపై ఎరువుల కొనుగోలు భారం కొంత మేర తగ్గుతోంది.

భూసారం కోసం..

నాకు రెండు ఎకరాల పొలం ఉంది. ఇప్పటివరకు నలభై ట్రిప్పుల ట్రాక్టర్ల పూడిక మట్టిని పొలాల్లో పోయించా. పొలం చదునుగా ఉండడంతోపాటు భూసారం పెరుగుతుందనే ఉద్దేశంతో మట్టిని తరలించుకున్నా.

– నూకల వెంకటేశ్వర్లు, రైతు, లింగాల

పనులను పర్యవేక్షిస్తున్నాం



రైతులు ట్రాక్టర్ తెచ్చుకుంటే కూలీలతో ఉచితంగా లోడింగ్ చేసి పంపిస్తున్నాం. వేసవిలో కూలీలందరికీ ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో గ్రామాల్లో జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తున్నాం. కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తున్నాం.

– రవి, ఏపీఓ

నేడు జలగం జనార్దన్ వర్ధంతి సభ



మాట్లాడుతున్న డేవిడ్‌కుమార్

భానుపురి : సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కమిటీ సభ్యుడు, ప్రతిఘటన పోరాట యోధుడు జలగం జనార్దన్ (జన్ను సార్) 3వ వర్ధంతి సభను మంగళవారం చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి డేవిడ్ కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక జిల్లా కార్యాలయంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పీడిత ప్రజల పక్షాన జన్ను సార్ అనేక ప్రజా ఉద్యమాలు చేశాడని అన్నారు. ఆయన ఆశయాల సాధన కోసం ప్రతి ఒక్కరూ పోరాడాలని పిలుపునిచ్చారు. నేడు ఉదయం 10 గంటలకు జరిగే సభలో అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శంకర్, నాయకులు కునుకుంట్ల సైదులు, సామ నర్సిరెడ్డి, పుల్లూరి సింహాద్రి, వీరబోయిన రమేష్, బోల్క పవన్, పిడమర్తి భరత్, ఎస్‌కే రహీం తదితరులు పాల్గొన్నారు.

ఫ్యాన్లు సమకూర్చడం అభినందనీయం



ఫ్యాన్‌లు అందజేస్తున్న మీలా మహదేవ్

సూర్యాపేటటౌన్ : పాఠశాలకు ఫ్యాన్‌లు అందించడం అభినందనీయమని సుధాకర్ పీవీసీ ప్రొడక్ట్ మేనేజింగ్ డైరెక్టర్ మీలా మహదేవ్ అన్నారు. అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ఏవీఎం పాఠశాలకు రూ.10వేల విలువల గల ఫ్యాన్‌లను అందించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కోట్ల ఆస్తుల కన్నా సామాజిక సేవలు మిన్న అని తెలిపారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యాస రాంకుమార్‌రెడ్డి, ఉప్పు నాగయ్య, బత్తిని దామోదర్‌రెడ్డి, అనంతరామశర్మ, గురుచరణ్, రవి కుమార్, జనార్దనాచారి, ప్రియాంక, వినయ్‌కుమార్ రెడ్డి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఉద్యమాలను బలోపేతం చేద్దాం



నివాళులర్పిస్తున్న నాయకులు

భానుపురి : జలగం జనార్దన్ (జన్ను సార్) ఆశయాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రజా ఉద్యమాలను బలోపేతం చేద్దామని సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ పిలుపునిచ్చారు. సోమవారం జలగం జనార్దన్ మూడో వర్ధంతి సందర్భంగా పట్టణంలో ఖమ్మంరోడ్డులోని పుల్లారెడ్డి నగర్‌లోని పార్టీ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జన్ను సార్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీని నిర్మాణం చేయడంలో ముందుండి, ఎంతో మంది పేదల సమస్యలను పరిష్కరించిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు కారింగుల వెంకన్న, పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎర్ర అఖిల్ కుమార్, నాయకులు పేర్ల నాగయ్య, చంద్రకళ, ఎస్.కె.సయ్యద్, పిడమర్తి లింగన్న, చిత్తలూరి లింగయ్య, గులాం హుస్సేన్, ప్రభాకర చారి, లక్ష్మయ్య, కొరివి పాపయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దిరాల : మద్దిరాల మండల కేంద్రంలో విద్యుత్ స్తంభాలకు వీధిలైట్లు ఏర్పాటు చేస్తున్నందున మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ సురేంద్రనాయక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6గంటల నుంచి 10గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉండనున్నట్లు పేర్కొన్నారు. సహకరించాలని వినియోగదారులను కోరారు.

ఆలయ వార్షికోత్సవం



పూజలు చేస్తున్న భక్తులు

నడిగూడెం : మండల కేంద్రంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయ 6వ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి సాయంత్రం వరకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు

- జాజిరెడ్డిగూడెం మండలంలో 1,302మంది ఓటర్లు
- ఓటర్ స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు



అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ బూత్

అర్వపల్లి : ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ నెల 27న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయి. ఈసారి జాజిరెడ్డిగూడెం మండలంలో పట్టభద్రుల ఓట్లు పెరిగాయి. మండలంలో మొత్తం 1,302మంది ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. ఇందులో 919మంది పురుషులు, 383మంది మహిళలు ఉన్నారు.

ముమ్మరంగా ఏర్పాట్లు..

జాజిరెడ్డిగూడెం మండలంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఈ పోలింగ్ కేంద్రంలో ఓటర్ల కోసం కనీస వసతులు సమకూరుస్తున్నారు. తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కేంద్రంలో ఎప్పటికప్పుడు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. మండల వ్యాప్తంగా 32మంది బీఎల్‌ఓలు పట్టభద్రుల ఓటర్లకు ఓటర్ స్లిప్‌లను ఇంటింటికీ తిరిగి పంపిణీ చేస్తున్నారు.

అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం



పట్టభద్రులైన ఓటర్లకు బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటర్ స్లిప్‌లను పంపిణీ చేస్తున్నారు. అర్వపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశాం. ఈ బూత్‌లో ఈ నెల 27న ఎన్నికల సందర్భంగా వెబ్‌కాస్టింగ్ కూడా ఉంటుంది. 1,302 మంది పట్టభద్రులు ఓటు వేయనున్నారు.

– జక్కరి శ్రీనివాసులు, తహసీల్దార్, జాజిరెడ్డిగూడెం మండలం

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

నాగారం : మండల పరిధిలోని ఈటూరు జెడ్పీహెచ్‌ఎస్‌లో 2006–2007 టెన్త్ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలను, మధురాను స్మృతులను గుర్తుచేసుకున్నారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అనంతరం తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రమేష్, భిక్షం, ఉప్పలయ్య, యల్లాచారి, పూర్వవిద్యార్థులు పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి వేడుకలకు ఆహ్వానం



ఎమ్మెల్యే సామేల్‌తో కాంగ్రెస్ నాయకులు

అర్వపల్లి : తిమ్మాపురం గ్రామ శివారులోని సూర్యనారాయణస్వామి క్షేత్రం ఆవరణలోని కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయంలో వచ్చే నెల 1న జరుగనున్న హనుమాన్ జయంతి మహోత్సవాలకు హాజరుకావాలని కోరుతూ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్‌కు ఆహ్వానపత్రిక అందజేశారు. ఈ కార్యక్రమంలో సూర్యక్షేత్ర వ్యవస్థాపకుడు, సౌర ఆరాధకుడు జనార్దన్‌స్వామి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ ఇందుర్తి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పాలెల్లి సురేష్, గణపురం నరేష్, గుండా శేఖర్, గుండా హరినాథ్, రత్నం లక్ష్మాజీ, బొడ్డు వెంకటనర్సు, బొల్లం బాలరాజు, పాలెల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణ

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని



మాట్లాడుతున్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

పెన్‌పహాడ్ : రాష్ట్రంలో కాంగ్రెస్‌పై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, బీజేపీకి ఆదరణ పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి గెలుపు కోసం సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నల్లగొండ–ఖమ్మం–వరంగల్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డికి ఓటేసి ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ కచ్చితంగా 400సీట్లు సాధించబోతుందని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ పరిపాలనతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని తెలిపారు. రాష్ట్రంలోని అధికార పార్టీని ఆదరిస్తే ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడే వారు ఉండరని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ కర్నాటి కిషన్, పార్టీ మండల అధ్యక్షుడు పోకల రాములు, మధు, చెన్ను రమణారెడ్డి, తూముల సాయి, రాపర్తి వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

మొక్కలు ఎండిపోకుండా చూడాలి



అడివెంలలోని సంపద వనంలో చెట్లకు నీళ్లు పోయిస్తున్న ఏపీఓ ఉపేందర్

అర్వపల్లి : తెలంగాణ సంపద వనాల్లో మొక్కలు ఎండిపోకుండా చూడాలని ఉపాధిహామీ పథకం ఏపీఓ చిలుక ఉపేందర్ కోరారు. సోమవారం అడివెంల గ్రామంలోని సంపద వనాన్ని పరిశీలించారు. కొన్ని మొక్కలు ఎండిపోగా వాటి స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు నాటించి నీళ్లు పోయించారు. ప్రతి రోజూ గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో మొక్కలకు నీళ్లు పోయిస్తున్నట్లు చెప్పారు. అన్ని సంపద వనాల్లో మొక్కలు ఎండిపోయిన చోట కొత్తగా మొక్కలను నాటుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈసీ నగేష్, ఫీల్డ్ అసిస్టెంట్ చెరుకు గంగ, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతుడికి పలువురి నివాళి

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు, మత్స్య సహకార సంఘం సభ్యుడు దేశగాని జోగయ్య మృతి బాధాకరమని మాజీ జెడ్పీటీసీ కోల ఉపేందర్‌రావు అన్నారు. సోమవారం ఆయన తాడువాయి గ్రామంలో జోగయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో మత్స్య సహకార సంఘం అధ్యక్షుడు బిట్టు లింగయ్య, బీఆర్‌ఎస్ గ్రామశాఖ కార్యదర్శి కోల ఆంజనేయులు, నాయకులు కోల శ్రీరాములు, కోల జోగయ్య, దేశగాని పాపయ్య, ములావత్ శ్రీను, మత్స్య సహకార సంఘం సభ్యులు కత్తి శ్రీను, వీరమల్ల వెంకటేశ్వర్లు, మొలుగూరి సైదులు, పాపయ్య, గురవయ్య, సర్వయ్య, లింగయ్య పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ



నాగారంలో నిమ్మల పిచ్చయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గుంటకండ్ల జగదీష్‌రెడ్డి

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన చిప్పపల్లి రాములు, నిమ్మల పిచ్చయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. చిప్పపల్లి రాజు రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి సోమవారం మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, చిప్పపల్లి సోమయ్య, ఎల్క సైదులు, చిప్పలపల్లి చిరంజీవి, కన్నెబోయిన భద్రయ్య, కత్తుల వెంకన్న, బద్దం వంశీరెడ్డి, దేవరకొండ మురళి, చిప్పపల్లి మల్లేష్ తదితరులు ఉన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం నాన్యతండా గ్రామ పంచాయతీ ఆవాసం పూర్యతండాకు చెందిన బీఆర్‌ఎస్‌వీ మండల అధ్యక్షుడు కేలోతు రవీందర్ నాయక్ తండ్రి, సీనియర్ నాయకుడు టాకిర్యా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో సోమవారం అతడి కుటుంబాన్ని జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్‌యాదవ్ పరామర్శించారు. టాకిర్యా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జేడి ఉపేందర్, బీఆర్‌ఎస్ నాయకులు, తండా వాసులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అన్నారం బ్రిడ్జి గ్రామానికి చెందిన కళ్లెం సోమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతిడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అదే విధంగా గ్రామానికి చెందిన ఆవుల నాగరాజు ఇటీవల తాడిచెట్టు పైనుంచి పడి చికిత్స పొందుతుండగా అతడిని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో నకిరేకంటి వెంకన్న, ఒగ్గు దేవయ్య, మధు పాల్గొన్నారు.

హరిహర క్షేత్రంలో పూజలు

నడిగూడెం : మండల పరిధిలోని రత్నవరం గ్రామంలోని హరిహర క్షేత్రంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, జలాభిషేకం, పంచామృతం, బోనాల ఊరేగింపు, బొడ్రాయికి అభిషేకాలు తదితర కార్యక్రమాలు చేపట్టారు. ముత్యాలమ్మ, మారెమ్మల ఆలయాల వద్ద తీర్థప్రసాదాల వితరణ చేశారు.

ఉపాధి పనుల పరిశీలన



కూలీలతో మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్

కోదాడరూరల్ : ఉపాధిహామీ కూలీలకు పనిచేసే చోట సౌకర్యాలు కల్పించాలని కోదాడ పీఏసీఎస్ చైర్మన్ ఓరుగంటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం కోదాడ మండల పరిధిలోని గుడిబండలో జరుగుతున్న ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో మాట్లాడారు. వేసవి దృష్ట్యా పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటు చేయాలని, కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని అన్నారు. పని చేసిన కూలీలకు వెంటనే వేతనాలు చెల్లించాలని కోరారు. కనీస వేతనాన్ని రోజుకు నాలుగు వందలకు పెంచాలని, సంవత్సరంలో 200 పనిదినాలు కల్పించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసిందని, కూలీలకు సరైన పని కల్పించకుండా కుట్ర చేస్తోందని అన్నారు.

సెంట్రల్ లైట్లు వెలగక అంధకారం



పోలీస్‌స్టేషన్ సమీపంలో లైట్లు వెలగక అంధకారంలో ఉన్న హైవే

అర్వపల్లి : అర్వపల్లిలో సూర్యాపేట–జనగామ జాతీయ రహదారిపై పలుచోట్ల సెంట్రల్ లైట్లు వెలగక అంధకారంగా మారింది. అయితే ఈ లైట్ల నిర్వహణ చూసే కాంట్రాక్టర్ గడువు ముగియడంతో వాటిని పట్టించుకునే వారు కరువయ్యారు. స్థానిక గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చిన్నచిన్న మరమ్మతులు చేయిస్తున్నప్పటికీ పెద్ద సమస్యలు ఏర్పడుతుండటంతో తరచూ లైట్లు పని చేయడం లేదు. ఈ లైట్లు వెలగక వారం రోజుల వ్యవధిలో పలు చిన్నచిన్న ప్రమాదాలు జరిగాయి. హైవే అధికారులు సెంట్రల్ లైట్లు పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు.

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు స్లిప్‌ల పంపిణీ



ఓటరు స్లిప్‌లు పంపిణీ చేస్తున్న బీఎల్‌ఓలు



మద్దిరాల : జి.కొత్తపల్లిలో..

తిరుమలగిరి : ఈ నెల 27న జరుగనున్న ఖమ్మం–వరంగల్–నల్లగొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా తిరుమలగిరి మున్సిపాలిటీ పరిధిలోని గ్రామాల్లో పట్టభద్రులైన ఓటర్లకు బీఎల్‌ఓలు సోమవారం ఓటరు స్లిప్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు పరశురామ్, మహేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : 27న జరగనున్న గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆయా గ్రామాల్లో బీఎల్‌ఓలు సోమవారం ఓటరు స్లిప్‌లను పంపిణీ చేశారు.

ఏపూర్ వాసికి డాక్టరేట్

ఆత్మకూర్ (ఎస్) : ఏపూర్ గ్రామానికి చెందిన మునిగడప పూర్ణాచారి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పొందారు. ఓయూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆదిలక్ష్మి పర్యవేక్షణలో 'నో వెల్ డీప్ లెర్నింగ్ అప్రోచెస్ ఫర్ ఎవాల్యుయేటింగ్ మాక్స్' అంశంపై డాక్టరేట్ సాధించినట్లు పూర్ణాచారి తెలిపారు.

ఎంజీ నగర్ తండా వాసికి..

చివ్వెంల : ఎంజీనగర్ తండాకు చెందిన రత్నావత్ హరిసింగ్ ఓయూ నుంచి కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగంలో డాక్టరేట్ పొందాడు. సీనియర్ ప్రొఫెసర్ డాక్టర్ నరసింహ పర్యవేక్షణలో నెట్‌వర్క్ ఇనిస్టిట్యూషన్ డిటెక్షన్ ఇన్ హనీపాట్ ఫ్రేమ్‌వర్క్ యూజింగ్ ఏఐ మోడల్స్ అనే అంశంపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందినట్లు హరిసింగ్ తెలిపారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

కోదాడ : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు కృషి చేయాలని తెలంగాణ వాణిజ్య పన్నుల శాఖ ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ నాగేందర్ సూచించారు. సోమవారం కోదాడ పట్టణంలోని ఎంఎస్ కళాశాలలో అంబేడ్కర్ ఆశయ సాధన కేంద్రం (ఆస్క్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాలిసెట్ ఉచిత కోచింగ్ సెంటర్‌ను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. పదవ తరగతి తరువాత ఐదారు సంవత్సరాలు విద్యార్థులు కష్టపడి చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా ఆస్క్ నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బల్గూరి స్నేహ, మాతంగా ప్రభాకర్, శౌరి, కిరణ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



నాగేందర్‌ను సన్మానిస్తున్న నిర్వాహకులు